సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 14 । నవంబర్ । 2023



రాజన్న సేవలో ..

వేములవాడ: రాజన్నను రాజన్నసిరిసిల్ల జిల్లా ఎన్నికల పరిశీలకులు వనితా సాహూ దర్శించుకున్నారు.



దిక్కులేని వారిని చేసి వెళ్లిపోయావా..

ఉపాధి వేటలో వలసకూలి బతుకు ఆరిపోయింది. పెద్దదిక్కు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. - వివరాలు 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. అతివేగంగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి రాజన్న సన్నిధిలో కార్తీక సందడి



వేములవాడ: రాజన్న సన్నిధిలో నేటి నుంచి కార్తీకమాసం శోభ సంతరించుకోనుంది. నెల రోజులపాటు విశేష పూజలతో రాజన్న ఆలయం మరింత శోభాయమానంగా వెలుగొందనుంది. స్వామి వారికి విశేష పూజలతోపాటు భక్తులు ఉపవాస దీక్షలు కొనసాగడం ఇక్కడ విశేషం. సోమవారం 20 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో భక్తులు శైవక్షేత్రాలను దర్శించుకుని తరిస్తారు. నెల మొత్తం ఉపవాస దీక్షలు చేపడుతూ అభిషేకాలు, అర్చనలు చేస్తారు. ప్రతీ సోమవారం, ఏకాదశి రోజుల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నారు.

పూజల మాసం

హరిహర క్షేత్రంగా వెలుగొందుతున్న రాజన్న ఆలయంలో కార్తీకమాసంలో ప్రత్యేక పూజలతోపాటు ఐదు రకాల నెయ్యితో దీపారాధన చేయడం శ్రేష్ఠంగా భావిస్తారు. కార్తీకమాసంలో పక్షం రోజులపాటు శివునికి, పక్షం రోజులపాటు కృష్ణునికి పూజలు చేయడం ఈ క్షేత్రంలో ఆనవాయితీ. కార్తీకమాసంలో దీపారాధన చేయడం ప్రత్యేకత. తులసి, ఉసిరిచెట్టుకు పూజలు చేయడం, లక్ష వత్తుల పూజలు, హోమాలు నిర్వహిండం ఈ ఆలయలో ప్రత్యేకత.

చెక్‌పోస్టు తనిఖీ



జిల్లెల్ల చెక్‌పోస్టు అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల శివారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జగదీశ్ సోన్కర్ పరిశీలించారు. చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందితో మాట్లాడి రికార్డులు తనిఖీ చేశారు.

అంతర్జాతీయ పోటీల్లో గోల్డ్‌మెడల్



కప్‌తో ఎడపెల్లి అనిల్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లికి చెందిన ఎడపెల్లి అనిల్ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. థాయిలాండ్, శ్రీలంక దేశాలలో జరిగిన ట్రైనేషన్ ఇంటర్నేషనల్ సెస్టోబాల్ టోర్నీకి భారత జట్టు తరపున పాల్గొన్న 12 మంది సభ్యుల్లో అనిల్ ఒకరు. భారత జట్టు ఈ పోటీల్లో విజయం సాధించి, గోల్డ్‌మెడల్ దక్కించుకుంది. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టులో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. సర్పంచ్ సోయినేని కరుణాకర్, ఎడపెల్లి హరీశ్, నేదూరి విజయ్, తలారి రవి, రాంగోపాల్‌రెడ్డి, సంతోష్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన తనిఖీ



పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల పరిశీలకులు

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆఫీస్‌లను కేంద్ర ఎన్నికల పరిశీలకులు సోమవారం తనిఖీ చేశారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్వో ఆఫీస్‌ల్లో నామినేషన్ల పరిశీలన కొనసాగుతుండగా ఎన్నికల పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, వినిత సాహులు పరిశీలించారు. నామినేషన్ల పరిశీలన ఎలా జరుగుతుంది.. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తున్నారా? లేదా ? అనే అంశాలను పరిశీలించారు. నిబంధనలు పాటించాలని ఆర్వోలకు సూచించారు. వేములవాడలో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లను ఆర్వో మధుసూదన్ తిరస్కరించారు. సిరిసిల్లలో అన్ని నామినేషన్లు సరిగ్గా ఉన్నాయని ఆర్వో ఆనంద్‌కుమార్ ఓకే చేశారు.

65 నామినేషన్ల తిరస్కరణ

జంగ్ తెలంగాణ

- 261 మంది అభ్యర్థులవి ఓకే
- ప్రముఖ నేతల కుటుంబసభ్యులవీ రిజెక్ట్
- ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఓకే
- స్వతంత్రులుగా గంగుల రజిత, ఆది వనజ
- 15 వరకు ఉపసంహరణకు అవకాశం



వేములవాడలో నామినేషన్లు పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి మధుసూదన్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పరిశీలన సోమవారం ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 65 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బీఫాంలు సమర్పించలేదని కొందరివి, తక్కువ మంది ప్రతిపాదించారని మరికొందరివి, సంతకాలు చేయకపోవడంతో ఇంకొందరివి రిజెక్ట్ చేసినట్లు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 261 మంది వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల, స్వతంతుల నామినేషన్లు ఆమోదం పొందాయి. కాగా, ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులు సేఫ్..

ఉమ్మడి జిల్లాలో అధికార బీఆర్‌ఎస్‌తోపాటు ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలు ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఇవి కాకుండా బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ, పలు చిన్న పార్టీల నాయకులు, ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి ఈసారి బరిలో ఉన్నవారిలో మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉన్నారు. ప్రస్తుతానికి వీరిలో ఎవరి నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు. కానీ, ముందు జాగ్రత్తగా వారికి డమ్మీగా వేసిన బంధువులు, కుటుంబసభ్యులవి రిజెక్ట్ అయ్యాయి.

తిరస్కరణకు గురైంది వీరే..

హుజూరాబాద్ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్ సతీమణి జమున బీజేపీ నుంచి, కోరుట్ల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తన కుమారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కి మద్దతుగా, మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, మంథని నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు సతీమణి శైలజ, మంథని నుంచే బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి సతీమణి సుజాత నామినేషన్ వేశారు. బీఫాం ఇవ్వలేదన్న కారణంతో వీరందరి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన సతీమణి వనజ నామినేషన్ వేశారు. ఈమె కాంగ్రెస్ తరపున బీఫాం ఇవ్వకపోవడంతో రిజెక్ట్ చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్‌ను ఓకే చేశారు. కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత వేసిన నామినేషన్‌ను అధికారులు ఆమోదించారు. ప్రస్తుతానికి ఆమె స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. వీరిద్దరూ మంగళ, బుధవారాల్లో నామినేషన్ ఉపసంహరించుకోనున్నారు.

ఉత్కంఠ రేపిన ఫిర్యాదులు

- పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి సీహెచ్.విజయరమణారావు విదేశీ ఆస్తులు, ఇక్కడ ఐటీ రిటర్నుల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు వచ్చింది. అయితే, సంతృప్తికర వివరణతో ఈ ఫిర్యాదును ఆర్‌వో డిస్పోజ్ చేశారు.
- మానకొండూరులో కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నా వాటిని అధికారులు పరిగణలోకి తీసుకోలేదు.
- కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ కేసుల విషయమై ఆర్‌వోకు ఫిర్యాదు వచ్చింది. చివరకు ఆయన నామినేషన్‌ను అధికారులు ఓకే చేశారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

తిరస్కరించిన నామినేషన్లు : కరీంనగర్‌లో 7, చొప్పదండిలో 1, మానకొండూర్‌లో 7, పెద్దపల్లిలో 5, మంథనిలో 4, రామగుండంలో 5, జగిత్యాలలో 2, కోరుట్లలో 5, ధర్మపురిలో 19, హుజూరాబాద్‌లో 8, సిరిసిల్ల 0, వేములవాడలో 2.

ఆమోదం పొందినవి : కరీంనగర్‌లో 31, చొప్పదండిలో 17, మానకొండూర్‌లో 13, పెద్దపల్లిలో 25, మంథనిలో 24, రామగుండంలో 26, జగిత్యాలలో 19, కోరుట్లలో 20, ధర్మపురిలో 18, హుజూరాబాద్‌లో 25, సిరిసిల్లలో 23, వేములవాడలో 20.

'సెస్'లో అగ్ని ప్రమాదం



'సెస్' ఆఫీస్‌లో కాలిబూడిదైన కంప్యూటర్లు, రికార్డులు

- ప్రమాదంపై అనుమానాలు
- రికార్డులు బూడిదైనట్లు సమాచారం
- రూ.5 లక్షల ఆస్తి నష్టం
- విచారణ ప్రారంభించిన పోలీసులు
- సీసీ కెమెరాల ఫుటేజీ స్వాధీనం
- బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : సెస్ చైర్మన్ రామారావు

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో దీపావళి పండుగ రోజు ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులోని పర్చేజ్, అగ్రిమెంట్(విద్యుత్ సామగ్రి కొనుగోలు, కాంట్రాక్టు అగ్రిమెంట్) సెక్షన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దీపావళి కావడంతో సెస్ క్యాష్ సెక్షన్ సిబ్బంది టపాసులు కాల్చడంతోనే నిప్పురవ్వలు మొదటి అంతస్తులోని పర్చేజ్, అగ్రిమెంట్ సెక్షన్‌లో ఎగిరిపడి అగ్ని ప్రమాదానికి కారణమైనట్లు సిబ్బంది పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆఫీస్‌లోని కంప్యూటర్లు, మ్యానువల్ రికార్డులు, సిబ్బందికి పంపిణీ చేయాల్సిన రేయిన్‌కోట్స్ కాలిపోయాయి. ఈ ఘటనలో రూ.5 లక్షల మేరకు నష్టం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు 'సెస్' అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, ఆఫీస్‌లోని సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తగులబడింది.. తగులబెట్టారా?

సెస్‌లో కీలకమైన విద్యుత్ సామగ్రి కొనుగోలు, కాంట్రాక్టు అగ్రిమెంట్‌లు చేసే విభాగంలో ప్రమాదం జరిగిందా? లేక ఆఫీస్ సిబ్బందే రికార్డులను తగులబెట్టారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం అమలుచేసిన దీన్‌దయాల్ విద్యుత్ యోజనలో చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ చేయాల్సిన అగ్రిమెంట్లు ఆ విభాగంలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు హెచ్‌వీడీఎస్ ప్రాజెక్టు పత్రాలు ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. ఈ సమాచారం నిక్షిప్తమైన కంప్యూటర్లు కాలిపోయాయి.

కుట్ర కోణంపై అనుమానాలు

ఈ ప్రమాదం వెనుక కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. సెస్ ఆఫీస్‌లో 32 సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగిన పర్చేజ్ సెక్షన్ సీసీ కెమెరా రికార్డులు పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి. ఆ గదిలోని సీసీ కెమెరా పనిచేయకుంటే ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందని సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

ఎవరిని వదిలిపెట్టం



అగ్ని ప్రమాదంపై విచారణకు ఆదేశించాం. ఉద్దేశపూర్వకంగా ఎవరైన ఈ ఘటనకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటాం. ప్రమాదవశాత్తు జరిగినా.. ఎవరి నిర్లక్ష్యం ఉందో తేలుతుంది. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పోలీసులకు ఫిర్యాదు చేశాం. కేసు విచారణ సాగుతోంది. విచారణ నివేదిక రాగానే అన్ని వివరాలు వెల్లడిస్తాను. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదు.

– చిక్కాల రామారావు, 'సెస్' చైర్మన్

'ప్రమాదం కాదు.. పెద్దకుట్ర'

సిరిసిల్లటౌన్: సెస్‌లో జరిగింది ప్రమాదం కాదని.. పెద్ద కుట్ర అని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కే.కే.మహేందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ వేర్వేరుగా ప్రెస్‌మీట్‌లలో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల అక్రమాలు వెలుగులోకి రావద్దనే ఉద్దేశపూర్వకంగానే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆరోపించారు.

టపాసుల మిరుగులుపడి అగ్నిప్రమాదం

సిరిసిల్లక్రైం: టపాసులు కాల్చడంతోనే మిరుగులు ఎగిరిపడి మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగిందని సెస్ ఎండీ సూర్యచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో కంప్యూటర్, రేయిన్‌కోట్స్, ప్రింటర్ కాలిపోయి రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈవీఎం.. వీవీప్యాట్ ఎప్పుడు వచ్చాయంటే..

మీకు తెలుసా..!



పెద్దపల్లిరూరల్: మనదేశంలో ఎన్నికలను బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో బ్యాలెట్ పేపర్ స్థానంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాలను (ఈవీఎం) అందుబాటులోకి తెచ్చారు. దేశంలోనే తొలిసారిగా 1982 మే19న కేరళ రాష్ట్రంలోని పరూర్ నియోజకవర్గంలో వినియోగించారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని షాద్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలతో పాటు 1982, 83లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈవీఎంలను వాడారు. అయితే వాటి పనితీరుపై రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలుపగా కొంతకాలం నిలిపివేశారు. ఆ తర్వాత 1999, 2004లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నుంచి ఈవీఎంలను వినియోగిస్తున్నారు. అయితే తాము ఎవరికి ఓటు వేశామో ఓటరు తెలుసుకునేందుకు వీలుగా 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీప్యాట్‌ను (ఓటర్ వెరిఫియేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) అనుసంధానించారు. దీంతో ఓటర్లు తాము ఓటు వేయాలనుకునే వారికే వేశామా లేదా అని నిర్ధారించుకునేందుకు వీలుకలిగింది.

'గుర్తింపు' ఉంటేనే ఓటు వేయొచ్చు

- ఏదో ఒక్క గుర్తింపుకార్డు తప్పనిసరి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఓటు వేసేందుకు ఏదో ఒక్క గుర్తింపుకార్డు ఉండాల్సిందేనని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి సోమవారం తెలిపారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఓటర్లకు 12 రకాల గుర్తింపు కార్డులకు ఎన్నికల సంఘం అనుమతించిందని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీచేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(ఆర్జీఐ), నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పీఐ) కింద జారీచేసిన స్మార్ట్‌కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీచేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీచేసిన అధికారిక గుర్తింపుకార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ జారీచేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు(యూడీఐడీ)లో ఏదో ఒక్కటి ఉన్నా ఓటు వేయవచ్చని కలెక్టర్ వివరించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

- నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా
- కరీంనగర్ ఎన్నికల పోలీస్ పరిశీలకులు, అదనపు డీజీపీ సతీశ్ గణేశ్



ఠాణాలో అదనపు డీజీపీ సతీశ్ గణేశ్, ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి(చొప్పదండి): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలని కరీంనగర్ ఎన్నికల పోలీస్ పరిశీలకులు, అదనపు డీజీపీ సతీశ్ గణేశ్ పేర్కొన్నారు. బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సందర్శించి మాట్లాడారు. ఠాణా పరిధిలో పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడ్డవారిపై దృష్టి పెట్టాలని, రౌడీషీటర్లపై నిఘా పెట్టాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ కృష్ణకుమార్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మండలంలోని కొదురుపాక, నీలోజిపల్లి, విలాసాగర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కొదురుపాక చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

నిలుస్తారా.. తప్పుకుంటారా?

- పూర్తయిన నామినేషన్ల పరిశీలన
- రెండు తిరస్కరణ..
- సిరిసిల్లలో 23.. వేములవాడలో 20 మంది పోటీ
- బరి నుంచి తప్పించేందుకు మొదలైన బేరసారాలు
- స్వతంత్రులకు ప్రధాన అభ్యర్థుల బుజ్జగింపులు
- రేపు నామినేషన్ల ఉపసంహరణ.. గుర్తుల కేటాయింపు



వేములవాడలో నామినేషన్ల స్క్రుటినీని పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల పరిశీలకులు

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టం నామినేషన్లు పరిశీలన సోమవారం పూర్తయింది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ స్థానాలకు 45 మంది అభ్యర్థులు 82 సెట్ల నామినేషన్లు వేశారు. పరిశీలన అనంతరం వేములవాడలో ఇద్దరి నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ తిరస్కరించగా.. సిరిసిల్లలో 23 నామినేషన్ల సరిగ్గానే ఉన్నాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.ఆనంద్‌కుమార్ ధ్రువీకరించారు. దీంతో జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 43 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

తలపడుతారా.. తప్పుకుంటారా ?

నామినేషన్లు వేసిన అభ్యర్థులు పోటీలో తలపడుతారా ? తమ నామినేషన్లపే ఉపసంహరించుకుంటారా.. అనే చర్చ సాగుతోంది. జిల్లాలో 22 మంది అభ్యర్థులు స్వతంత్రులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇండిపెండెంట్లను, చిన్న పార్టీల అభ్యర్థులను బుజ్జగించే పనిలో ఉన్నారు. పోటీ నుంచి తప్పుకో తమ్మీ అంటూ.. పార్టీ ముఖ్యనేతలు బుజ్జగిస్తున్నారు. ఎక్కువ మంది పోటీలో ఉంటే ఎన్నికల ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం ఉంది. ఓట్ల మెజార్టీపై ప్రభావం చూపుతుంది. ఈ కారణంగా ఎన్నికల బరిలో ఉన్న వారిని బతిమిలాడి పోటీ నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 15 వరకు గడువు ఉండడంతో మంతనాలు జోరందుకున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో తలపడుతారా? పోటీ నుంచి తప్పుకుంటారా? అనే చర్చసాగుతోంది. నామినేషన్ ఉపసంహరించుకుంటే.. తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ప్రచారం జోరందుకోనుంది.



సిరిసిల్లలో నామినేషన్లు పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్‌కుమార్

సిరిసిల్ల బరిలో వీరే..

నామినేషన్ల పరిశీలన అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుంట్ల తారక రామారావు(బీఆర్‌ఎస్), కె.కె.మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్), గోగుల రాణి రుద్రమ(బీజేపీ), భూమేశ్ పిట్టల(బీఎస్పీ), పత్తిపాక సురేశ్(ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, ఇండిపెండెంట్), శ్రీనివాస్ లగిశెట్టి(ఇండిపెండెంట్, విద్యార్థుల రాజకీయ పార్టీ), కేసుగాని పరమేశ్వరి(ధర్మ సమాజ్ పార్టీ), గౌటే గణేశ్(శివసేన), రాగుల రాములు(ఆబాద్ పార్టీ), దోసల చంద్రం(ఇండియా ప్రజాబంధు), ద్యాప దేవయ్య(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), రెడ్డిమల్ల శ్రీనివాస్(ఆర్‌పీఐ, అతువాలే), పల్లికొండ గంగనర్సయ్య(ఆర్‌పీఐ, అంబేద్కర్), కటుకం మృత్యుంజయం(ఇండిపెండెంట్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), కొండ రవికాంత్(అలియెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ), ఇండిపెండెంట్లుగా తాటిపాముల శ్రీనివాస్, రిక్కుమల్ల మనోజ్‌కుమార్, అన్నారం సాయికుమార్, దొనికెని కృష్ణ, బుసాపురం ప్రవీణ్, నక్క హరిశ్, జంగిడ్ మధు, కొండూరి బాలలింగంల నామినేషన్లు పోటీకి అర్హతను సాధించాయి.

వేములవాడలో..

శ్రీనివాస్ ఆది(కాంగ్రెస్), చెలిమెడ లక్ష్మీనర్సింహారావు(బీఆర్‌ఎస్), వికాస్ చెన్నమనేని(బీజేపీ), తుల ఉమ(బీజేపీ, ఇండిపెండెంట్), ఎర్రం మహేశ్(బీజేపీ), ఆది వనజ(కాంగ్రెస్, ఇండిపెండెంట్), మోహన్ గోలి(బీఎస్పీ), గుగ్గిళ్ల రవీందర్(ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, ఇండిపెండెంట్), మహ్మద్ నజీర్(బీజేపీ, ఇండిపెండెంట్), గడ్డం హరీశ్(ధర్మ సమాజ్ పార్టీ), జక్కని భూపతి(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), అఖిల్ మహమ్మద్(అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ), ఇండిపెండెంట్లుగా జింక శ్రీనివాస్, గుడిసె మోహన్, మెరుపుల రాకేశ్, కట్కూరి అనోస్, అంగూరి రంజిత్, పుప్పాల మోహన్, రవి నాయిని, అజ్మీరా రమేశ్‌బాబుల నామినేషన్లు ఓకే అయ్యాయి.

రేపు ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు

నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం వరకు గడువు ఉంది. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు గుర్తులు కేటాయిస్తారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

పాపయ్యపల్లెను సందర్శించిన డీపీవో

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పాపయ్య పల్లె గ్రామపంచాయతీని సోమవారం జిల్లా పంచాయతీ అధికారి ఎ.రవీందర్ సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి వాణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో సోషల్‌మీడియా వార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల ఓటింగ్ సమీపిస్తున్న వేళ ఇల్లంతకుంట మండలంలో వేడి రాజుకుంటోంది. రాజకీయ పార్టీల ప్రధాన అనుచరులు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు ఘాటైన వ్యాఖ్యలు చేసుకుంటుంటే.. తామేం తక్కువ కాదు అన్నట్లు బీజేపీ నాయకులు విమర్శలకు దిగుతున్నారు. తమ నాయకుడే గొప్ప అంటే కాదు తమ లీడరే గొప్ప అంటూ పోస్టులపై పోస్టులు పెడుతున్నారు. వీరి విమర్శల పోస్టులు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లకు తలనొప్పిగా మారింది.

దాచిన బంగారం రేషన్‌పాలు !

సిరిసిల్లక్రైం: దాచిన బంగారం రేషన్‌బియ్యంలో కలిసిపోయింది. పనికి వెళ్లేటప్పుడు దొంగలు దోచుకెళ్తున్నారని భయపడి ఓ వివాహిత బియ్యం సంచిలో బంగారు గొలుసును దాయగా.. ఆ బియ్యాన్ని కాస్త భర్త అమ్మివేయడంతో ఆమె లబోదిబోమంటోంది. సిరిసిల్ల మున్సిపాలిటీ విలీన గ్రామం చంద్రంపేటకు చెందిన బాలవ్వ పొలం పనులకు వెళ్తున్నానని తన మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును ఇంటిలోని ఓ రేషన్‌బియ్యం సంచిలో దాచింది. ఈ విషయం తెలియని ఆమె భర్త ఆ రేషన్ బియ్యాన్ని ముష్టిపల్లిలోని ఓ రైస్‌మిల్లులో విక్రయించాడు. సాయంత్రం పొలం నుంచి ఇంటికొచ్చిన బాలవ్వకు బియ్యం బస్తా కనిపించకపోవడంతో భర్తను అడిగింది. బియ్యాన్ని రైస్‌మిల్లులో అమ్మినట్లు తెలపడంతో అసలు విషయాన్ని భర్తకు తెలిపి.. హుటాహుటిన రైస్‌మిల్లుకు వెళ్లి.. వారిని అడిగారు. బియ్యాన్ని లెవీలో కలిపేశామని, సంచుల్లో నింపేటప్పుడు దొరికితే ఇస్తామని వారు చెప్పారు. చేసేదేమి లేక ఇంటిముఖం పట్టారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారం ఇప్పుడు చంద్రంపేటలో చర్చగా మారింది.

నలుగురి బైండోవర్

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులను సోమవారం తహసీల్దార్ రజని ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు. వీరిపై గతంలో కేసులు నమోదయ్యాయని, ఎన్నికల నియమావళిలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మెట్‌పల్లి: రెడ్డి కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వారి నుంచి రూ.6.50లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



ముస్తాక్(ఫైల్)

కోరుట్లరూరల్: చిన్నమెట్‌పల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో మహమ్మద్ ముస్తాక్(30) అనే వ్యక్తి మృతిచెందాడు. సోమవారం తను కౌలుకు చేసే పొలంలో కింద పడి ఉన్న విద్యుత్ తీగను చుడుతుండగా.. షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- పరిహారం రాలేదు.. ప్యాకేజీ మరిచారు
- ఉపాధి అవకాశాలు లేవు
- మిడ్‌మానేరు నిర్వాసితులు

సాక్షి పీపుల్స్ ఎజెండా


కొదుమంజ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు ప్రాజెక్టులో సర్వం కోల్పోయాం.. ఉన్న ఊరిని వదిలి వచ్చాం.. ఇక్కడ ఉపాధి లేదు.. చేసేందుకు పని లేక దిక్కులు చూస్తున్నామంటూ మధ్యమానేరు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీసారి తమ సమస్యలు పరిష్కారిస్తామంటున్న నాయకులు ఏళ్లుగా పట్టించుకోవడం లేదంటున్నారు. ఊళ్లలో యువకులు ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నారని.. యువతకు ఉపాధి చూపాలని.. ఇంకా చాలా మంది నిర్వాసితులకు ప్యాకేజీ.. పరిహారం డబ్బులు రావాల్సి ఉందని.. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో చాలా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తామని స్పష్టం చేస్తున్నారు.

ఉపాధి కల్పించాలి



మిడ్‌మానేరు ముంపు గ్రామం కావడంతో ఉపాధి లేక ఇబ్బందిపడుతున్నాం. మాకు ఉపాధి కల్పించే నాయకుడికే ఓటు వేస్తాం. ఉపాధి కల్పిస్తామని నమ్మకం కల్పించాలి. నిర్వాసిత యువత ఆలోచించి ఓటు వేయండి.

– మహేశ్, కొదుమంజ

ఖాళీగా ఉంటున్నాం



మిడ్‌మానేరు ముంపు గ్రామం కావడంతో ఉపాధి లేక, ఉద్యోగాలు రాక ఖాళీగా ఉంటున్నాం. ఉద్యోగం, ఉపాధి ఎవరిని ఎంచుకుంటే వస్తుందో.. వారికే ఓటు వేస్తాం.

– సందీప్, రుద్రవరం

పట్టించుకోవాలి



మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలను పూర్తిస్థాయిలో పట్టించుకుని, అంటుబాటులో ఉన్న నాయకులకు ఓటు వేస్తాం. సమస్యలు పరిష్కరించే నాయకుడిని ఎన్నుకుంటాం.

– మల్లయ్య, రుద్రవరం

చాలా మందికి పరిహారం రాలేదు




మిడ్‌మానేరులో సర్వం కోల్పోయినం. ఇప్పటికీ చాలా మందికి పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. అందరూ సమస్యలు పరిష్కారిస్తామంటున్నారే.. తప్పా పట్టించుకునే వారు లేరు. సమస్యలు పరిష్కరించే వారికి ఓటు వేస్తాం.

– నర్సయ్య, కొదుమంజ

వైద్యం వికటించి కూలీ మృతి

- సిరిసిల్లలో ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన
- శవం తరలింపుతో తోపులాట.. ఉద్రిక్తత
- రోడ్డెక్కిన మృతుడి బంధువులు
- పరిహారం అందించిన ఆస్పత్రి వర్గాలు
- కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు


అంబులెన్స్‌ను అడ్డుకుంటున్న మృతుని బంధువులు


చిలుక భీమయ్య (ఫైల్)

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున వైద్యం వికటించి ఓ నిరుపేద కూలి బలయ్యాడు. బాధితులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన చిలుక భీమయ్య(55) ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. వారం క్రితం ఇంటికి చేరిన భీమయ్యకు కడుపునొప్పి వచ్చింది. సిరిసిల్లలోని పాతబస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. కడుపులో పేగుకు పుండ్ అయిందని, సర్జరీ చేయాలని రూ.40వేలకు ప్యాకేజీ మాట్లాడి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ జరిగిన రెండో రోజు భీమయ్య చికిత్స పొందుతూ ఐసీయూలోనే మరణించాడు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి వర్గాలు పరిహారం ఇవ్వాలని నిమ్మపల్లి వాసులు పట్టుబట్టారు. భీమయ్యకు నిద్రలోనే గుండెపోటు రావడంతో మరణించాడని, ఆపరేషన్ విజయవంతమైందని, కోలుకుంటున్న దశలో గుండెపోటు వచ్చింద.. వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని వైద్యుడు తెలిపారు. ముందుగానే రిస్క్ ఉంటుందనే విషయాన్ని రోగి కుటుంబ సభ్యులకు చెప్పామని, ఈమేరకు తమ వద్ద వీడియోగ్రఫీ ఉందని స్పష్టం చేశారు. భీమయ్యకు భార్య అమృత, కొడుకులు నరేందర్, గణేశ్, కూతురు గౌతమి ఉంది. నిరుపేద కుటుంబం కావడంతో పరిహారం ఇవ్వాలని బాధితులు పట్టుబట్టారు.

శవం బలవంతంగా తరలింపులో ఉద్రిక్తత..

ప్రైవేటు ఆస్పత్రి వర్గాలతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చర్చలు జరుపుతుండగానే.. భీమయ్య శవాన్ని మార్చురీకి అంబులెన్స్‌లో తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా.. మృతుడి కుటుంబ సభ్యులు, పలువురు మహిళలు అడ్డుకున్నారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, టౌన్ సీఐ ఉపేందర్, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలను మోహరించారు. మృతుడి కుటుంబ సభ్యుల నిరసనలతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. చివరికి ఆస్పత్రి యాజమాన్యం మృతుడి కుటుంబానికి పరిహారం ఇచ్చేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని నిమ్మపల్లికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

లింగాపూర్‌లో రైతు..

- ఆర్‌ఎంపీ ఇంటి ఎదుట మృతుడి కుటుంబసభ్యుల నిరసన
- పరారీలో వైద్యుడు


రాజిరెడ్డి (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని లింగాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానిక ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించి, మృతిచెందాడని బాధిత కుటుంబసభ్యులు అన్నారు. ఈ మేరకు సదరు వైద్యుడి ఇంటి ఎదుట నిరసన తెలిపారు. మృతుడి సోదరుడు, పోలీసుల వివరాల ప్రకారం.. అంతం రాజిరెడ్డి(51) వారం రోజుల క్రితం పొలం పనులకు వెళ్లి, అనారోగ్యానికి గురయ్యాడు. గ్రామంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లగా ఇంజక్షన్ వేసి, సెలైన్ పెట్టాడు. తర్వాత అతని శరీర రంగు మారింది. కుటుంబసభ్యులు హుటాహుటిన కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించడం వల్లే రాజిరెడ్డి మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మృతదేహంతో సదరు వైద్యుడి ఇంటి ఎదుట బైఠాయించారు. కానీ, అంతకుముందే సదరు అతను పరారయ్యాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నర్సింగాపూర్‌లో షార్ట్‌సర్క్యూట్

- రూ.6 లక్షల సామగ్రి దగ్ధం


షార్ట్ సర్క్యూట్ జరిగిన ఇల్లు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన ఎలగందుల శ్రీనివాస్ ఇంట్లో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో భారీగా ఆస్తినష్టం సంభవించింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. శ్రీనివాస్ కిరాణ దుకాణాలకు తినుబండారాల సామగ్రి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. మంటల్లో తినుబండారాల సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు శ్రీనివాస్ తెలిపాడు. కాలిపోయిన సామగ్రి విలువ రూ.6 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నాడు.

దిక్కులేని వారిని చేసి వెళ్లిపోయావా..

- ఉపాధివేటలో పోయిన ఊపిరి
- యువకుడి మృతితో రోడ్డున పడ్డ కుటుంబం
- బండపల్లిలో విషాదం
- విరాళాలు అందిస్తున్న గ్రామ యువకులు


బాబు(ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చందుర్తి(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువై ఎడారి దేశానికి వెళ్లిన యువకుడి శవమై ఇంటికి తిరిగొచ్చాడు. యువకుడి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు గ్రామానికి చెందిన యువకులు ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నారు. మండలంలోని బండపల్లికి చెందిన రేగుల బాబు(39) గత డిసెంబర్‌లో జీవనోపాధి కోసం కువైట్ వెళ్లాడు. ఇరువై రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. అక్కడ వైద్యం చేయించుకున్నప్పటికీ తగ్గలేదు. రెండు, మూడు రోజుల్లో ఇంటికొస్తానని భార్యకు వారం క్రితం ఫోన్ చేసి చెప్పాడు. పరిస్థితి విషమించి బాబు శుక్రవారం మృతి చెందాడు. ఈ అతని స్నేహితులు ఫోన్ ద్వారా బాబు భార్య కల్యాణికి ఫోన్‌లో తెలపడంతో ఆమె గుండెలవిసేలా రోదించింది. బాబు శవపేటిక సోమవారం బండపల్లికి చేరింది. తండ్రి శవాన్ని చూసి కూతురు, కుమారుడు, భార్య రోదించిన తీరు అందరిని కన్నీరు పెట్టించింది.

చిన్ననాటి నుంచి కష్టాలే..

బాబు చిన్నతనంలోనే తండ్రి లచ్చయ్య మృతి చెందడంతో తల్లి లచ్చవ్వ గ్రామంలో చిన్న హోటల్ నడిపిస్తూ కుమారుడిని పోషించింది. బాబు పదోతరగతి చదువుతుండగా తల్లి అనారోగ్యంతో చనిపోయింది. ఒంటరిగా జీవిస్తున్న బాబు బంధువులు పెళ్లి చేశారు. స్వగ్రామంలో చిన్నాచితక పనులు చేసుకునేవాడు. ఇటీవల అప్పు చేసి కువైట్‌కు వెళ్లాడు. అక్కడ పరిస్థితులు అనుకూలించకపోవడంతో జ్వరంబారిన పడి గత శుక్రవారం మృతిచెందాడు.

ముందుకొచ్చిన యువకులు

బాబు కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ యువకులు ముందుకొచ్చారు. మృతుడికి పదమూడేళ్ల కూతురు రష్మిత ఉంది. ఆమె చదువుల కోసం యువకులు రూ.50వేలు జమచేశారు. మరింత మొత్తం జమచేసి అందజేసేందుకు యువకులు ప్రయత్నిస్తున్నారు.

ఆలయ నిర్మాణంలో విభేదాలు

- సమావేశమైన గ్రామస్తులు


సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణంలో విభేదాలు తలెత్తుతున్నాయి. ఆలయ కమిటీ పునర్ నిర్మాణానికి టీటీడీ తరఫున రూ.3కోట్లు విడుదల చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పనులు చేపడుతున్నారు. ఈక్రమంలో ప్రస్తుత ఆలయ కమిటీ పాలకవర్గానికి, కొందరు గ్రామస్తులకు మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. ఈమేరకు సోమవారం ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు సమావేశమయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ పదవికి వేలం పాట నిర్వహించాలని కొందరు నిర్ణయించారు. ఓ వైపు ఆలయ పనులు సాగుతుంటే.. కమిటీ ఎన్నికకు వేలం పాట నిర్వహించడం సరికాదని ప్రస్తుత చైర్మన్ నంది కిషన్ అన్నారు. గుడి నిర్మాణం గురించి ఆలయంలో చర్చించాలే కానీ.. గ్రామపంచాయతీలో మాట్లాడడంపై ప్రశ్నించారు. గత రెండేళ్లుగా ఆలయ పునర్‌నిర్మాణానికి తన శాయశక్తుల కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కాగా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ ఆలయ పునర్ నిర్మాణంలో అందరూ సమష్టిగా ముందుకు పోవాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ పదవికి వేలం పాట నిర్వహించాలని పేర్కొనడం సరికాదన్నారు. ఆలయ కమిటీ పాలకవర్గం విషయంలో విభేదాలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


సువర్ణ మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని సైదాబాద్‌కు చెందిన కోడెం శ్రీనివాస్‌కు గోదావరిఖనికి చెందిన సువర్ణ(35)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులిద్దరూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో దీపావళి నోము ఉందని శనివారం రాత్రి దంపతులు హైదరాబాద్ నుంచి బైక్‌పై సైదాబాద్ వస్తున్నారు. జమ్మికుంట పట్టణ శివారులోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పడంతో సువర్ణ కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్ అజాగ్రత్తగా బైక్ నడపడం వల్లే సువర్ణ మృతి చెందిందని ఆమె సోదరుడు పోరండ్ల భీంరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మోహన్ (ఫైల్)

మానకొండూర్: మండలంలోని కొండపల్కలకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, సీఐ రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. శ్రీరాముల మోహన్(33) తన నాయీబ్రాహ్మణ వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా విపరీతమైన వెన్ను నొప్పి వస్తుండటంతో ఆస్పత్రిలో చూపించుకొని, మందులు వాడుతున్నాడు. అయినా నొప్పి తగ్గడం లేదు. ఈ క్రమంలో దీపావళి పండుగ సందర్భంగా అతని భార్య రజని ఖాజీపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. మోహన్ సోమవారం ఉదయం ఇంటి ఆవరణలో గల మామిడి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో సర్టిఫికెట్లు దగ్ధం


కాలిపోయిన సర్టిఫికెట్లు

చందుర్తి(వేములవాడ): దీపావళి పండుగపూట దేవుళ్లకు దీపారాధన చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. మండలంలోని జోగాపూర్ అనుబంధ గ్రామం గుడిపేటలో జరిగిన ఈ ప్రమాదంలో చింతం వెంకటేశం కుమారుడు మధుబాబుకు సంబంధించిన పదో తరగతి సర్టిఫెకెట్లు కాలిపోయాయి. అంతేకాకుండా రూ.5వేల నగదు, ఆధార్ కార్డు, పట్టేదారు పాసు పుస్తకం, వ్యవసాయ సంబంధిత డాక్యుమెంట్స్ దగ్ధమయ్యాయి. విద్యార్థి సర్టిఫికెట్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేశ్ కోరారు.

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ


చెక్కులు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని రాజన్నపేట, అల్మాస్‌పూర్, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేటల్లోని పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున అందించారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, నాయకులు గుల్లపల్లి నరసింహారెడ్డి, నమిలికొండ శ్రీనివాస్, అందె సుభాష్, కిషన్, మల్లారెడ్డి, నరసింహులు, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగ


ప్రధాన రహదారిపై తెగిపడిన విద్యుత్ తీగ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): దీపావళి పండుగ వేళ మండలకేంద్రంలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై సాయంత్రం 11 కేవీ విద్యుత్ తీగ తెగి రోడ్డుపై అడ్డంగా పడింది. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తారు. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అదృష్టవశాత్తు విద్యుత్ తీగ ఎవరికీ తాకకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు వెంటనే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేసి మరమ్మతు చేయించడంతో వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి.

చిరుతదాడిలో రెండు ఆవులు మృతి


సంఘటన స్థలంలో ఫారెస్ట్ అధికారులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని మద్దిమల్ల లొద్దితండా గ్రామపంచాయతీ పరిధిలో చిరత దాడిలో భూక్య మురళికి చెందిన రెండు ఆవులు చనిపోయాయి. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిచూడగా చిరుత దాడి చేసినట్లు గుర్తించాడు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

రామగిరి: కుటుంబ కలహాలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. భార్య మృతిచెందింది. కల్వచర్ల పంచాయతీ ప్రశాంత్‌నగర్‌లో ఉప్పులూరి వీర్రాజు, వీర రాఘవమ్మ(55) దంపతులు కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. వీర్రాజు కొద్దికాలంగా మద్యానికి బానిసవడంతో.. గొడవలు మొదలయ్యాయి. సోమవారం వీర్రాజు మద్యం తాగి వీర రాఘవమ్మతో గొడవ పడడంతో.. మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగింది. అనంతరం వీర్రాజు తాగాడు. గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో భార్య మృతిచెందింది. మెరుగైన చికిత్స కోసం వీర్రాజును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి ఇద్దరి కూతుళ్లకు వివాహమైంది. మృతురాలి కూతురు మద్దుకూరి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కటికె రవిప్రసాద్ తెలిపారు.

మద్యం పట్టివేత



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలో బైక్‌పై వెళ్తున్న వేముల పెంటయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా.. హర్యానకు చెందిన మద్యం సీసాలు లభ్యమయ్యాయని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రంగంపల్లికి చెందిన పెంటయ్య ఢిల్లీ నుంచి కార్లు కొనుగోలు చేసి తెచ్చి ఈ ప్రాంతంలో అమ్ముతుంటాడని, తిరుగు ప్రయాణంలో హర్యాన మద్యం సీసాలను వెంట తెచ్చి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పెంటయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది శరత్‌బాబు, శ్రీనాద్, కృష్ణ, మోజెస్, కార్తీక్‌రెడ్డి ఉన్నారు.

రాజన్న సన్నిధిలో దీపావళి వేడుకలు




వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో దీపావళి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. సాయంత్రం 6 గంటల నుంచి దాదాపు గంటన్నరపాటు కల్యాణమంటపంలో ధనలక్ష్మీ పూజను స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ ఆధ్వర్యంలో చేశారు. అనంతరం శ్రీపార్వతీరాజరాజేశ్వరస్వామి, శ్రీఅనంతపద్మనాభస్వామి వారి ఉత్సవమూర్తులను గజవాహనంపై ఊరేగించారు.